# కనువిప్పు

-షాహీన్‌ఖాన్

"త్వరగా భోజనం పెట్టు బయటకెళ్లాలి'' ఖంగుమన్న కంఠానికి ఉలిక్కిపడి లేచింది సుగుణ. అప్పుడు టైమ్ పదకొండు కావస్తోంది.

గబగబా అన్ని డిషెస్ డైనింగ్ టేబుల్‌మీద పెట్టింది. ఈలోపు వచ్చాడు ఆమె భర్త కిరణ్. సుగుణ భోజనం చేసిందా లేదా అని కూడా అడగకుండా భోజనానికి ఉపక్రమించాడు.

నోట్లో అన్నం ముద్ద పెట్టి కోపంగా "ఏంటిది? అన్నమేనా లేక బియ్యం తెచ్చి పెట్టేసావా?'' గట్టిగా గదిమాడు.

"అన్నమేనండీ. మీరు అన్నం పొడిపొడిగా ఉండాలని అన్నారుకదా. అందుకే అలా వండాను'' భయం భయంగా చెప్పింది.

"ఇదేంటి చారా? లేక చింతపండు పులుసు తెచ్చి అలా పెట్టేసావా? ఇంత పుల్లగా ఉందేమిటి?'' మళ్లీ కోపంగా అన్నాడు.

సుగుణకు ఏమనాలో తోచలేదు. కన్నీళ్లను బలవంతంగా ఆపుకుంది.

"ఇది కూరా?'' విసుగ్గా అన్నాడు.

"అవునండీ. దొండకాయలు వేయించాను''

"అసలు దొండకాయలు వేగాయా? పచ్చిపచ్చిగా ఉన్నాయి...ఛ...ఛ.. అసలు నీకు వంట వచ్చా?''

"వచ్చు...వచ్చండి'' గబగబా చెప్పింది.

"వచ్చి కూడా ఇంత ఛండాలంగా చేసావేం? మొగుడేకదా ఎలా వండినా తినేస్తాడని ధీమా. మొగుడంటే నీకు లక్ష్యంలేదు, గౌరవంలేదు. అందుకే ఇలా చేస్తున్నావు?'' వెటకారంగా అన్నాడు.

"ఎందుకండీ సూటిపోటి మాటలతో నన్ను హింసిస్తారు'' కన్నీళ్లతో అడిగింది.

"నేను నిన్ను హింసిస్తున్నానా? ఇలాంటి భోజనం పెట్టి నువ్వు నన్ను హింసిస్తున్నావా? అర్ధరాత్రి మొగుడు ఆకలితో వస్తే ఇలగేనా భోజనం పెట్టేది? భోజనం ఒక్కటేనా? ప్రతి పనీ అలాగే చేస్తున్నావు. బట్టలు.. ఏమైనా ఉతుకుతున్నావా?''

"నాకు బట్టలు ఉతకడం అలవాటు లేదండీ. మా ఇంట్లో వాషింగ్ మెషిన్ ఉంది'' అంది.

"ఓహో...వాషింగ్ మెషిన్ కూడా కొనలేని చవటను నేను అనేగా నీ ఉద్దేశ్యం''

"అయ్యయ్యో అలాగని నేనెప్పుడు అన్నానండీ'' కంగారుగా అంది.

"చూడూ! మర్యాదగా నేను చెప్పినట్లు విని, నేనేం చేయమంటే అది చేస్తేనే నిన్ను ఈ ఇంట్లో ఉంచేది. లేకపోతే విడాకులిచ్చి నీ తల్లిదండ్రుల దగ్గరకు పంపిస్తాను. మైండిట్'' అని భోజనంలో చేయి కడిగేసి లేచి వెళ్లిపోయాడు.

మరిక అన్నం తినబుద్ధికాలేదు సుగుణకు. అయినా కడుపులో ఆకలి దంచేస్తూ ఉండడంవల్ల మజ్జిగన్నం తిని లేచింది.

***

సుగుణ, కిరణ్‌లకు పెళ్లయి మూడునెలలు కావస్తోంది. పెళ్లయిన కొత్తల్లో ఇలా ప్రవర్తించేవాడుకాదు. నీళ్లబిందెలు ఇంట్లోకి తెచ్చిపెట్టడం, బట్టలు ఉతికితే మేడమీదకు తీసుకువెళ్లడం, చిన్న చిన్న పనులలో సాయం చేస్తుండడం, వారానికోసారి సినిమాకో, షికారుకో తీసుకెళ్లడం చేస్తుండేవాడు.

కానీ రెండునెలల నుండి ఇలా మారిపోయాడు. సుగుణకేం పాలుపోవడంలేదు. లోలోపలే ఆమె కృంగిపోతోంది. తల్లిదండ్రులకు ఉత్తరం వ్రాద్దామని లేదా ఫోన్ చేద్దామని అనుకుంది కానీ పెద్ద గొడవైపోతుందేమో, అందరిలోనూ తను నవ్వులపాలు అయిపోతుందేమోనని భయపడుతోంది.

తల్లికి ఫోన్‌లో ఒకసారి చూచాయిగా చెప్పింది.

కానీ "నువ్వే సర్దుకుపోవాలమ్మా''అంది తల్లి. దాంతో ఇంక ఏదీ చెప్పడానికి ఆమెకు మనస్కరించలేదు.

పెళ్లి గురించి ఎన్నో కలలు కంది. కానీ వాస్తవంలోకి వచ్చేసరికి ఇంత చేదుగా ఉంటుందని ఆమెకిప్పుడిప్పుడే అనిపిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం ఆ భగవంతుడే చేయాలని ప్రతిరోజూ భగవంతుడిని వేడుకుంటోంది.

వీళ్ల సంభాషణ అంతా పక్క గదిలో వున్నామె వింటోందని వాళ్లకు తెలీదు.

గిన్నెలన్నీ తీసుకెళ్లి సింక్‌లో పెడుతుంటే ఆమె గదిలో నుండి బయటకొచ్చి "భోజనం చేసావా సుగుణా?'' అని అడిగింది.

"ఆ...ఆ...చేసానండీ.. మీరింకా నిద్రపోలేదా?'' అని అడిగింది సుగుణ.

"లేదమ్మా. నిద్ర పట్టడంలేదు. కొత్త ప్రదేశం కదా. ఏడి వాడు? బయటకెళతానన్నాడు. వెళ్లిపోయాడా?'' అని అడిగింది.

ఆమె తన మాటలన్నీ విన్నదని అర్థమైపోయింది సుగుణకు. తమ ఇంటి గుట్టు బయట పడినందుకు మరింత సిగ్గుపడింది.

"లేదండీ ఉన్నారు. బహుశా డ్రెస్ వేసుకుంటున్నట్టున్నారు'' అంది.

వీళ్ల మాటలు విని రూమ్‌లో నుండి బయటకొచ్చాడు కిరణ్.

"అరె...అక్క...ఎప్పుడొచ్చావ్?'' ఆశ్చర్యంగా అడిగాడు.

"సాయంత్రం వచ్చాన్రా'' అంది కిరణ్ అక్క సులోచన.

"అక్క వచ్చిందని చెప్పలేదేం?'' కోపంగా అడిగాడు కిరణ్ సుగుణను.

"అమ్మాయినేమీ అనవద్దు కిరణ్. నువ్వు బయటకెళ్తున్నావా?'' అని అడిగింది.

"లేదు..లేదు'' అన్నాడు కిరణ్.

"పద! ఆరుబయట కూర్చుని మాట్లాడుకుందాం. మళ్లీ నేను తెల్లారి వెళ్లిపోవాలి'' అంది.

"అప్పుడేనా?''

"మీ బావగారు నాకు భరణం కింద ఇచ్చిన స్థలం అమ్మేయడానికి ఏలూరు వెళ్లాను. మళ్లీ తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం వెళ్తూ ఇలా దారిలో నిన్ను చూసినట్లు వుంటుందని ఈ ఊర్లో దిగాను. రేపటి నుండి పిల్లలకు పరీక్షలు. వాళ్ల చదువుల కోసమే ఆ స్థలం అమ్మివేయాల్సి వచ్చింది'' అంది.

అప్పటికే ఇద్దరూ బయట వరండాలోకి వచ్చేసారు.

అక్కడున్న కుర్చీలో ఇద్దరూ కూర్చున్నారు.

"ఊ... ఇప్పుడు చెప్పు ఎలా ఉంది నీ కొత్త కాపురం?"

"బాగానే వుంది" తను అన్న మాటలు వినలేదుకదా అని సందేహపడ్డాడు.

"కిరణ్! నా ముఖం చూసి చెప్పు" అంది సులోచన.

"అదేంటక్కా అలా అడుగుతున్నావు? నీ దగ్గర దాపరికం ఎందుకు?" తల దించుకునే అన్నాడు.

"కిరణ్! నువ్వు లాయర్‌వా? లయ్యర్‌వా?" నవ్వుతూనే చురక అంటించింది.


"అక్కా! ఆర్యూ జోకింగ్?" నవ్వుతూ అడిగాడు కిరణ్.

"నో...భోజనాల దగ్గర మీ సంభాషణ అంతా విన్నాను. నువ్వు ఆ అమ్మాయిని ఇష్టపడే పెళ్లి చేసుకున్నావా?"

"అవును"

"మరి అలా రాచి రంపాన పెట్టడం ఏమన్నా బాగుందా?"

""నేను రాచి రంపాన పెట్టానా? అలాగని నా భార్య నీతో చెప్పిందా? చెప్పే వుంటుంది. రాగానే లేనిపోనివి నామీద కల్పించి చెప్పే వుంటుంది"



కోపంగా అన్నాడు.

"నో...నో...నువ్వు పొరబడుతున్నావు. నీ భార్య పేరుకు తగ్గట్టు సుగుణాల రాశి. ఎమ్‌బిఏ చేసినా మహారాణిలా తనింట్లో బ్రతికినా ఇక్కడకొచ్చి పనిమనిషి లేకపోయినా అన్ని పనులూ తనే చేసుకుంటోంది. ఆమె స్థానంలో వేరే ఎవరు ఉన్నా అటు పుల్ల ఇటు వేసేవారుకాదు.

నేను ఊరు నుండి రాగానే స్నానానికి నీళ్లు పెట్టింది. స్నానం చేసి వచ్చేసరికి వేడి వేడి ఉప్మా తయారుచేసి ఇచ్చింది. రాత్రి నేను త్వరగా తింటానని అది కూడా చపాతీలే తింటానని చపాతీలు చేసింది. మళ్లీ అందులో కూర. నాకోసం వేరేగా కూర, పులుసు, అన్నం... ఇవన్నీ చేసింది. ఈ రోజుల్లో ఏ ఆడపిల్లా ఇలా అణకువగా ఉంటుందో చెప్పు? పెళ్లిలో చూసిన సుగుణకు ఇప్పటి సుగుణకు ఎంతో తేడా కనిపిస్తోంది. ఆమె చిక్కి సగమైంది. దానిక్కారణం నువ్వు పెడుతున్న మానసిక క్షోభ! చూడు కిరణ్! నేను చెబుతున్నానని ఏమీ అనుకోవద్దు.


## డోర్‌బెల్‌కి లైసెన్స్

జర్మనీలో గెరిట్ బ్రూయిన్‌జే అనే అతని పెంపుడుకుక్క జెర్మన్ షెపార్డ్ కొన్నాళ్ల క్రితం చనిపోయింది. అతనో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆ కుక్కమీద ప్రేమతో చనిపోయిన కుక్క గొంతు స్వరం వినిపించేలా సాఫ్ట్‌వేర్ తయారుచేసి తన డోర్‌బెల్‌కి కనెక్టు చేసాడట. అక్కడ్నించి ఎవరైనా అతని డోర్ బెల్ కొడితే గతంలో అతని కుక్కలా మొరగసాగిందా బెల్లు. దాంతో ఆ కుక్కని తల్చుకుని అతను తెగ మురిసిపోయాడు మొదట. కానీ కుక్కకి లైసెన్స్ తీసుకోలేదేమని అధికారులు వచ్చి పీకల మీద కూర్చున్నారుట. తమ ఇంట్లో కుక్క లేదని వాళ్ళని నమ్మించడానికి అతనికి తల ప్రాణం తోకకి వచ్చిందిట. ఈయేడు కుక్క గొంతు వినిపిస్తోందని మళ్లీ లైసెన్స్ కట్టమని అతని వెంటపడ్డారుట అధికారులు.

## నిష్ణాతులైన చిన్నారులు

ఇంకా వాళ్లకి గెడ్డాలు రాలేదు. డ్రైవింగ్ లైసెన్సులు దొరికే వయస్సు కాదు. కానీ సైన్స్ రీసెర్చిలో అప్పుడే నిష్ణాతులై అమెరికాలో అవార్డులు అందుకుంటున్నారు ఇండియన్ స్టూడెంట్లు. ఇటీవల జరిగిన సైన్స్ కాంపిటీషన్‌లో బ్రిలియంట్ స్టూడెంట్స్‌గా ఎన్నుకోబడ్డ ఆరుగురిలో ఇద్దరు ఇండియన్లు, ఇద్దరు చైనీయులు, ఇద్దరు లోకల్ అమెరికన్లు. ఫార్మాస్యూటికల్ రీసెర్చిలో వినూత్నమైన పరిశోధనలు చేసినందుకు హైస్కూలు కుర్రాడు కిరణ్ పెండ్రికి 50వేల డాలర్లు, దేశ్‌మోహన్‌కి 30వేల డాలర్లు బహుమతిని ప్రకటించారు.

-తటవర్తి




నీ భార్యను నువ్విలా మాటలతో హింసించడం ఏమీ బాగాలేదు. నువ్వు లాయర్‌వి అయ్యుండి కూడా ఇలా ప్రవర్తించడం ఏమన్నా బాగుందా చెప్పు? నా భర్త పెట్టే బాధలు చూడలేక నాకు విడాకులు ఇప్పించిన నువ్వేనా నీ భార్యను హింసిస్తోంది? నాకోసం పోరాడిన ఆ కిరణ్ ఏమయ్యాడు? భార్యాభర్తలిద్దరూ సమానమేనని, ఒకర్నొకరు గౌరవించుకోవాలని కోర్టులో ఎలుగెత్తి చాటిన కిరణ్ ఏమైపోయాడు? నీ దగ్గరకొచ్చేసరికి పురుషాహంకారాన్ని చూపిస్తున్నావా?

కిరణ్! పెళ్లంటే ఏమిటి? సహజీవనం. ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, కష్టసుఖాలు సమానంగా పంచుకుంటూ జీవనం సాగించడం. కాదంటావా?"

"కానీ... అది...అక్కా... పెద్దక్క చెప్పింది"

"పెద్దక్క ఏం చెప్పింది?"

"పెళ్లయిన కొత్తల్లో నేను బట్టలు తీసుకెళ్లి మేడమీద ఆరబెడుతుంటే పెద్దక్క వచ్చింది. ఇలా ఆడంగి పనులు అప్పగించిందా నీ భార్య అని ఎగతాళి చేసింది. ఈ రోజు ఈ పని చేయమంది, రేప్పొద్దున్న బట్టలు ఉతకమంటుంది.

ఆ మర్నాడు అంట్లు తోమమంటుంది. ఇంకోరోజు వంట చేయమంటుంది. నిన్ను తన చెప్పుచేతల్లో వుంచుకోవాలని ప్రయత్నిస్తోంది. అసలే ఢిల్లీ పిల్ల. నమ్మకూడదు" అంది.

"అప్పటినుండి నువ్వు మారిపోయావా? ఎప్పుడూ భార్యాభర్తల మధ్య మూడో మనిషి రాకూడదు. వస్తే సంసారం నిలవదు. మీ బావగారు కూడా మంచివారే. కానీ తల్లి, చెల్లెయిల మాటలు విని నన్ను రాచి రంపాన పెట్టేవారు. భరించలేనన్ని బాధలు పెట్టారు. అందుకే ఆయన్ని వదిలేయాల్సి వచ్చింది.

కిరణ్! నీకు పెళ్లయి మూడునెలలే అయింది. ఇప్పుడే నువ్విలా ప్రవర్తిస్తే ఇక ఆమె జీవితాంతం నీతో ఎలా కాపురం చేస్తుంది?" అని అడిగింది సులోచన.

"అలా బాధలు పెడితేనే భయంతో నేను చెప్పినట్లు వింటుందని, భార్యను భర్త ఎప్పుడూ తన చెప్పుచేతల్లో వుంచుకోవాలని, లేకపోతే భార్య భర్తను కీలుబొమ్మను చేస్తుందని పెద్దక్క చెప్పింది"

సులోచనకు నవ్వాలో ఏడవాలో తెలియలేదు.

"అందుకని నువ్వు శాడిస్ట్‌గా మారిపోయావా?"

"శాడిస్ట్‌గానా?"

"లేకపోతే! శారీరకంగానేకాదు, మానసికంగా హింసించడం కూడా శాడిజమే అవుతుంది. సుగుణ తల్లిదండ్రులు అంత దూరం ఢిల్లీలో ఉన్నారు. ఆమెకు బంధువులుగానీ, స్నేహితులుగానీ ఎవ్వరూ ఇక్కడ లేరు. అందుకని తల్లయినా, తండ్రయినా, భర్తవైనా అన్నీ నువ్వే. అంతేకానీ ఇలా ప్రవర్తించడం ఏమైనా బాగుందా? కిరణ్! ఇంత చదువుకున్న నువ్వే ఇలా ప్రవర్తిస్తే అసలేమీ చదువుకోని నీ బావకు తేడా ఏంటి? అతనిలాగే నువ్వూ ప్రవర్తిస్తున్నావు? కిరణ్! నేను ఆడదాన్ని కనుక సాటి ఆడదాని మనసేమిటో తెలుసు. భార్యకు పనుల్లో సాయపడడంవల్ల నువ్వంటే ఆమెకింకా ఇష్టం, ప్రేమా పెరుగుతాయే గానీ తరగవు. నా భర్త నాకన్ని వేళలా తోడుగా ఉంటాడన్న నమ్మకం ఆమెకు కలిగి ధైర్యంగా ఉండగలుగుతుంది. నాతిచరామి అంటూ అగ్నిసాక్షిగా చేసిన ప్రమాణాలు ఏమైపోయాయి? నీ సంస్కారం ఏమైంది? ఆమె నీళ్ళు పడితే బిందెలు లోపల పెట్టు, బజారు నుండి కూరగాయలు, సరుకులు తీసుకురా. సినిమాలకు, షికార్లకు తిప్పు. అప్పుడే ఇద్దరి మధ్య ప్రేమబంధం బలపడుతుంది.

కిరణ్! ఏ ఆడపిల్లయినా పెళ్లి చేసుకుని తల్లిదండ్రుల్ని, అక్కచెల్లెళ్లను, స్నేహితులను, బంధువులను, అన్నదమ్ముల్ని, ఉన్న ఊరును అన్నిటినీ వదిలి భర్త వెంట ఎందుకు వస్తుందనుకున్నావు? కేవలం నమ్మకం. ఇతను నావాడు,

నా మంచిచెడ్డలు ఇకనుంచి అన్నీ ఇతనే చూసుకుంటాడు అని నిశ్చింతగా వస్తుంది. కానీ అలాంటి భర్తే ఆమెతో రాక్షసంగా ప్రవర్తిస్తే ఇక ఆ బాధ ఎవరితో చెప్పుకుంటుంది?

కిరణ్! నీ జీవితం నా జీవితంలా కాకూడదనే నా తాపత్రయం. ఇప్పటికైనా కళ్ళు తెరువు. ఇంకా మించిపోయిందేమీలేదు. నీ భార్యకు ప్రేమతో దగ్గరవ్వు.

కిరణ్! జీవితం చాలా చిన్నదిరా. దాన్ని వీలైనంతవరకు సరదాగా, హాయిగా, సంతోషంగా ఎంజాయ్ చేయాలిగానీ ఇలా పాడు చేసుకోకూడదు. ఇంత రాత్రి భోజనానికి వచ్చావ్. మళ్లీ బయటకు వెళ్లిపోతానంటున్నావు. నువ్వు మగాడివి. నీకు బయట ఫ్రెండ్స్, కొలీగ్స్... ఇలా ఎందరితోనో పరిచయం వుంటుంది.

వాళ్లతో సరదాగా కాలక్షేపం చేస్తావు. కానీ నీ భార్యకు నువ్వే లోకం. నీ కోసమే ఆమె ఎదురు చూస్తుంది. నీ సంతోషమే తన సంతోషంగా భావిస్తుంది. ఆమె సాయంత్రం నుండి ఎదురుచూస్తోంది నువ్వొచ్చి మమ్మల్నిద్దర్నీ గోదావరి ఒడ్డుకు తీసుకువెళ్తావేమోనని. అలా తను ఎంతసేపు ఎదురుచూసిందో చెప్పలేను. నేను నీకు ఫోన్ చేయమని చెప్పాను. కానీ చేయలేదు. చేస్తే నువ్వు దెబ్బలాడతావేమోనని చేసి ఉండదు.

నీకు అక్కగా కాదు, ఒక ఫ్రెండ్‌లా, నీ శ్రేయోభిలాషిలా చెబుతున్నాను. ప్లీజ్ కిరణ్! సుగుణను మరో సులోచనగా మార్చవద్దు. భర్త తోడులేక పిల్లలతో నేను పడుతున్న బాధలు ఏ స్త్రీ పడకూడదు. నా మాటల్ని ఈ చెవిన విని ఆ చెవిన వదిలేయకుండా ఓ లాయర్‌గా కాదు, మానవత్వంవున్న మనిషిలా ఆలోచించు.

పరిస్థితి ఎంతో విషమిస్తేతప్ప విడాకులు ఇప్పించని నువ్వు ప్రతి జంటను వీలైనంతవరకూ కలపడానికే ప్రయత్నించే నువ్వు ఇలా ప్రవర్తించడం ఎంత కుసంస్కారం అనిపించుకుంటుందో ఆలోచించు. ఈన భార్యే విడాకులకు అప్లై చేసే స్థితిని తీసుకురాకు.

నీకు కనువిప్పు ఎప్పటికి కలుగుతుందో ఏమో? నేను చెప్పవలసింది చెప్పాను. ఆ తరువాత నీ ఇష్టం. చాలా పొద్దుపోయింది పద. మళ్లీ పొద్దునే లేవాలి'' అంది.

కిరణ్ ఏం మాట్లాడకుండా అలా మౌనంగా ఉండిపోయాడు.

అతడి మెదడు ఆలోచించడం ప్రారంభించింది. అతన్ని ఆ స్థితిలో వదిలి లోపలకు వచ్చింది సులోచన.

గుమ్మం చాటున వున్న సుగుణ వచ్చి సులోచన పాదాలను కన్నీళ్లతో తడిపింది.

సుగుణ అలా చేస్తుందని ఊహించని సులోచన గబగబా ఆమె భుజాలు పట్టుకుని లేపి ఆమె కన్నీళ్లు తుడిచి "ఛ..ఛ... ఏంటిది సుగుణా! ఇంక నీ కళ్లల్లో నేనెప్పుడూ కన్నీళ్లు చూడకూడదు. మా తమ్ముడు మారతాడు. ఆ విషయం నేను నమ్మకంగా చెప్పగలను. నా మాటలతో బ్రెయిన్‌వాష్ చేసాను. ఎంతైనా టీచర్‌ని కదా.. మా తమ్ముడికి కనువిప్పు కలగడం ఖాయం'' అంది నవ్వుతూ.

"ఆడబడుచు అంటే మీలా కూడా వుంటారని నాకిప్పుడే తెలిసింది. మీలాంటి ఆడపడుచులు నాకు దొరికినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. మీ మాటలు విని ఆయన మారితే నాకంతే చాలు'' అంది సుగుణ.

"మారతాడు నాకా నమ్మకముంది. నా తమ్ముడి స్వభావం నాకు తెలుసు. వాడి ప్రవర్తన అలా ఉండదు. వాడు స్త్రీలనెంతో గౌరవిస్తాడు. అలాంటివాడు ఇలా మారాడంటే ఎవరో నూరిపోస్తేనే ఇలా అయి వుంటుందని భావించాను. నా అంచనా సరైనదేనని తేలింది. ఈసారి వచ్చినప్పుడు నువ్వు నవ్వుతూ కనిపించాలి. అలా కనిపిస్తావన్న నమ్మకం నాకుంది'' అంది.

అప్పుడే గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

"అదిగో గడియారం కూడా గంట కొట్టింది. నా మాట నిజమయి తీరుతుంది. నీకే సమస్య వచ్చినా నేనున్నానన్న విషయం మరచిపోవద్దు'' నవ్వుతూ అంది సులోచన.

మరో పావుగంట తరువాత కిరణ్ సుగుణ గదిలోకొచ్చాడు. సుగుణ అతని కోసమే ఎదురుచూస్తోంది.

కిరణ్ ఆమె దగ్గరకు వచ్చాడు.

"సుగుణా! ఐయామ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ. నా ప్రవర్తనకు నేనే సిగ్గుపడుతున్నాను.ఇంక నిన్నెప్పుడూ నా మాటలతోగానీ, చేతలతోగానీ బాధపెట్టను. ప్రామిస్'' అంటూ ఆమె చేతిలో చేయి వేసి ఆమెను హృదయానికి హత్తుకున్నాడు.

కిటికీలోనుండి దొంగ చూపులు చూస్తున్న చందమామ ఇక చూడలేక సిగ్గుతో మబ్బులచాటుకు వెళ్లిపోయాడు. ఆ రాత్రి తొలిరాత్రికంటే ఆనందంగా గడిచింది.

★



## ఆమెకే సాధ్యం

ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం కొందరికే సాధ్యం. తెలుగులో మంచి హీరోయిన్‌గా గుర్తింపు పొందిన అందాల స్నేహాకి సింప్లిసిటీ అంటే ఎంతో ఇష్టంట. 'మనసు పలికే మౌనరాగం' చిత్రంలో మంచి చీరకట్టుతో సింపుల్‌గా కన్పించి అందర్నీ కవ్వించనుందీ భామ. అన్నట్టు ఈ భామకి అలనాటి తారలు సావిత్రి, భానుమతిలంటే ఇష్టంట. వారిలా సింపుల్‌గా ఉంటానంటోంది.

